క్లుప్తంగా

ఉమ్రా యాత్ర కోసం లక్కీ డ్రా



న్యూశాయంపేట: మహ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా వరంగల్ నగరంలోని మండిబజార్‌లో ఉమ్రా యాత్ర కోసం గురువారం లక్కీ డ్రా నిర్వహించారు. ఈ డ్రాలో ఎంపికైన వరంగల్ శంభునిపేటకు చెందిన మహ్మద్ ఆరీఫ్‌ను సభ్యులు అభినందించారు. రిథా ట్రావెల్స్ ఆధ్వర్యంలో 40 మంది రూ.2 వేల చొప్పున సమీకరించుకొని లక్కీ డ్రా ద్వారా ఎంపికైన ఒకరికి పవిత్ర మక్కా దర్శనం కోసం ఉమ్రా యాత్రకు పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డ్రాలో ఎంపికైన వ్యక్తికి మిగతా వారంతా కలిసి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఖాజా జాఫరుల్ అబిద్దీన్, ముస్తాఫ రజా, షాహిద్ రజా, సిరాజ్ అహ్మద్, లతిఫుల్ రహమాన్, రఫిఉర్ రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధభవన్ పునర్నిర్మాణ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



మడికొండ: హనుమకొండలోని బుద్ధభవన్ పునర్నిర్మాణ ఆహ్వాన పత్రికను మడికొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆవిష్కరించారు. అక్టోబర్ 1వ తేదీన ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మడికొండ గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్, జవ్వాజి కిషన్, జానపట్ల సారయ్య, దుబాసి పద్మరావు, దయాకర్, అనిల్, రాజ్‌కుమార్, కట్ట వెంకటరామ్ నర్సయ్య, అంకేశ్వరపు భానుకుమార్, కిషన్, మహేందర్, వీరేష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కాజీపేట: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలను విరమించేలా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని పీసీసీ సభ్యుడు కాయిత రాజ్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. కాజీపేట మండలం సోమిడి గ్రామంలో ఆయన గురువారం మాట్లాడుతూ కనీస వేతనాల చట్టాన్ని అమలు చేస్తూ, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీల సమ్మెకు రాజకీయ పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

హరీశ్‌రావును కలిసిన నేతలు



హన్మకొండ: రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి కలిశారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నర్సంపేటకు వచ్చిన మంత్రిని వారు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

హైకోర్టు ఉత్తర్వులు విచారకరం

ఐనవోలు: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పేపర్ 2 ఉత్తీర్ణులైన వారికే స్కూల్ అసిస్టెంట్లుగా నియమించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం విచారకరమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీఎస్ఆర్ మల్లిక్, చుంచుకాల లింగారావు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 2010 ఆగస్టు 23వ తేదీ కంటే ముందే సర్వీసులో చేరిన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత మినహాయించినట్లు తెలిపారు. దాని తర్వాత ప్రత్యక్ష నియామకం ద్వారా సర్వీసులో చేరే వారికి మాత్రమే టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అయిందని పేర్కొన్నారు. ఈ ఉద్దేశంతో సర్వీసులో ఉన్న ఏ ఉపాధ్యాయుడూ టెట్ పరీక్ష రాయలేదని తెలిపారు. హఠాత్తుగా టెట్ ఉత్తీర్ణులైన వారికే పదోన్నతి కల్పిస్తామని చెప్పడం సరికాదని తెలిపారు. పదోన్నతుల కోసం ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్న సీనియర్ టీచర్లకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పుపై పునఃసమీక్షకు అప్పీలు చేయాలని కోరారు.

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమా హైస్కూల్‌లో ఈనెల 30వ తేదీన మేరీ స్టెల్లా కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు రెజీనా ముండి కాన్వెంట్ సుపీరియల్ సిస్టర్ ఇన్నాసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మేళనానికి విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా ‘మిలాద్ ఉన్ నబీ’



ప్రవక్త అవశేషాన్ని తిలకిస్తున్న మేయర్, ఎమ్మెల్సీ



చీరలు పంపిణీ చేస్తున్న జబ్బార్, తదితరులు



పిల్లలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న కొండా సురేఖ



వరంగల్: అన్నదానం చేస్తున్న ముస్లింలు

న్యూశాయంపేట: మహ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. అన్నదానాలు, స్వీట్ల పంపిణీ, ప్రత్యేక ప్రార్థనలు, ర్యాలీలు నిర్వహించి వేడుకలను ముస్లింలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. నగరంలోని ఉర్సు మషూఖ్ రబ్బాని దర్గా హవేలీలో మహ్మద్ ప్రవక్త అవశేషం (మీసం వెంట్రుక)ను ప్రజల సందర్శనార్థం ఉంచారు. మహ్మద్ ప్రవక్త అవశేషాన్ని మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, తదితరులు తిలకించారు. అలాగే, వరంగల్ మండిబజార్ ఖైరుల్‌ఉల్ మదర్సాలో ప్రవక్త మొక్క అవశేషాలను ప్రదర్శనకు ఉంచారు. కార్యక్రమంలో దర్గా పీఠాధిపతులు నవీదాబాబా, ఉబేద్ బాబా, సయ్యద్‌షా హిలాలుద్దీన్ ఖాద్రీ మాషూఖీలతో పాటు జాఫరుల్లా అబేదీన్, సిరాజ్ అహ్మద్, సాదిఖ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్‌లో..

ఖిలా వరంగల్: సర్వ మానవాళిని కాపాడుతూ శాంతి మార్గం చూపేదే మహ్మద్ ప్రవక్త అని ఈద్గా, మసీదు అభివృద్ధి కమిటీ ప్రతినిధి, తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ.జబ్బార్ అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవం సందర్భంగా వరంగల్ ఫోర్ట్‌రోడ్డు, శంభునిపేట జంక్షన్, దూపకుంట రోడ్డులోని ఆర్ఆర్ గార్డెన్‌లో తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో గురువారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఖిలా వరంగల్ పడమరకోటలో ముస్లిం, మైనార్టీ నేతలు రఫీక్, గౌస్, సిరాజ్, ఆషు సంయుక్త ఆధ్వర్యంలో స్వీట్లు, పాయసం పంపిణీ చేశారు.

14వ డివిజన్‌లో..

వరంగల్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని ఏనుమాముల బాలాజీనగర్‌లో అజ్మీర్ ఇంజనీరింగ్ వర్క్స్ యజమాని సయ్యద్ ఇంతియాజ్ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి స్థాపన కోసం మహ్మద్‌ను చివరి ప్రవక్తగా అల్లా నియమించాడని ముస్లింలు భావిస్తారని చెప్పారు.

పోచమ్మమైదాన్‌లో..

రామన్నపేట: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని 22వ డివిజన్ పోచమ్మమైదాన్‌లో సయ్యద్ వసీం ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కొండా సురేఖ హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్వీట్లు, పాయసం పంపిణీ చేశారు.

భగత్‌సింగ్ ఆశయాలు ఆదర్శం



నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థినులు



హన్మకొండ: శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు



కాశిబుగ్గ: భగత్‌సింగ్ నగర్‌లో..

విద్యారణ్యపురి: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎస్సీ గర్ల్స్ హాస్టల్ ఎదుట విద్యార్థులతో కలిసి భగత్‌సింగ్ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, బాధ్యులు మంద వికాస్, మహేశ్వరి, నమిత, సుస్మిత, వసుధ, ఐశ్వర్య, వర్షిత, నవ్య, భవాని, అనూష, వేద, సరిత, పూజ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

హన్మకొండ: దేశం కోసం చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ హనుమాన్‌నగర్ -1లో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమార్ రెడ్డి, మాదారపు ఉదయ్ కిరణ్, చిర్ర శ్రవణ్, రాజ్‌కుమార్, వెంకటేష్, రవికిరణ్, నరేష్, అజయ్, శివ, సందీప్ పాల్గొన్నారు.

ప్రాణత్యాగం చేసిన వీరుడు

కాశిబుగ్గ: దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయస్సులో ప్రాణత్యాగం చేసిన మహావీరుడు భగత్‌సింగ్ అని టీపీసీసీ మీసాల ప్రకాశ్ కొనియాడారు. భగత్ సింగ్ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ నగర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జంగం ప్రభాకర్, లాజర్, జగన్నాథచారి, ఎండీ.గౌస్, యాకుబ్, కళింగరావు, ఉస్మాన్, అహ్మద్, చంద్రమౌళి, లక్ష్మి, సరోజన పాల్గొన్నారు.

రేపు ముక్తార్ పాషా వర్ధంతి సభ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రామన్నపేట: ఈనెల 30న నగరంలోని ఖిలా వరంగల్ పెట్రోల్ పంపు రోడ్డులోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ముక్తార్ పాషా 3వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. పోచమ్మమైదాన్ కూడలిలో ముక్తార్ పాషా సంస్మరణ సభ వాల్ పోస్టర్లను ప్రజా సంఘాల నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్తార్ పాషా విద్యార్థి దశ నుంచే విప్లవ భావాలు కలిగిన వాడని, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో విప్లవ కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు బండి కుమార్, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు, శంకర్ లింగం, ఎండీ.ఖాన్, ఎడ్ల రవి, మహిపాల్ రెడ్డి, ఉప్పుల రాజు, భాస్కర్ పాల్గొన్నారు.

పార్టీలు మోసం చేస్తున్నాయి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హసన్‌పర్తి: గౌడ కులస్తులను రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని గౌడ జేఏసీ ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ రంజిత్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 1న హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్న గౌడ గర్జనసభ వాల్‌పోస్టర్లను సిద్ధాపురంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గౌడ కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనలక్ష్మి, జేఏసీ నాయకులు యుగంధర్ గౌడ్, సాగర్, జనార్ధన్ గౌడ్, శ్రీనివాస్, క్రాంతి, ప్రవీణ్, అజయ్ పాల్గొన్నారు.

బహుజన రాజ్యంతోనే న్యాయం



అభివాదం చేస్తున్న నాయకులు

హన్మకొండ: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం జరగాలంటే బహుజన రాజ్యం రావాలని, ఆ దిశగా తామంతా ఐక్యంగా పోరాడాలని సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు యేశబోయిన సాంబయ్య యాదవ్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని న్యాయవేదిక జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దామెరుప్పుల శంకర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కొమురం భీం లాంటి అనేక మంది వీరులు పోరాడి దొరల గడీలను కూలదోచారని వివరించారు. ఆనాడు రజాకార్లను ఎదురించింది బహుజనులే, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణ త్యాగాలను చేసిందీ వారేనని అని చెప్పారు. బహుజనుల కొట్లాడి తెచ్చిన తెలంగాణను ప్రస్తుతం దొరలు ఏలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సామాజిక న్యాయవేదిక మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కూరాకుల భారతి, ములుగు జిల్లా అధ్యక్షురాలు మడే పూర్ణిమ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడే భిక్షపతి, ప్రభాకర్, ముదిరాజ్, పద్మశాలి, ముస్లిం, యాదవ మహాసభ, ఆదివాసీ, మాల మహానాడు, విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

‘నాయిని’వి అసత్య ఆరోపణలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ వేముల శ్రీనివాస్

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌పై కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు ధ్వజమెత్తారు. హనుమకొండలోని అశోక హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, కానుగంటి శేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ భూకబ్జాలకు పాల్పడుతున్నారని నాయిని విమర్శల్లో వాస్తవం లేదన్నారు. తన ఉనికి కోసం, రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీ, ఆపార్టీ నాయకుడు నాయిని రాజేందర్ రెడ్డి అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వినయ్‌భాస్కర్‌పై బురద జల్లే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పులి రజనీకాంత్, నలుబోలు సతీష్, చుంచు అశోక్, నెక్కొండ కిషన్, వీరగంటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వర్కర్ల నిరసన



బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన వర్కర్లు

హన్మకొండ: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 9రోజులుగా నిరవధిక సమ్మె, ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు గురువారం వినూత్న నిరసన తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ఆటపాటలతో నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించాలని, గౌరవ వేతనం రూ.3 వేలు అందించాలని కార్మికులు కోరారు. ఈ సందర్భగా తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ధర్మల రామ్మూర్తి మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు గడ్డం లలిత, విజయ, కవిత, రమ, జనగాని లక్ష్మి, ఐలయ్య, పద్మ, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘ఆశ’లకు రూ.18 వేలు చెల్లించాలి



మాట్లాడుతున్న కాసు మాధవి

హన్మకొండ: ఆశ కార్యకర్తలకు రూ.18 వేల చొప్పున వేతనం చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు కాసు మాధవి డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేస్తున్న ఆశ కార్యకర్తలు హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద చేస్తున్న దీక్షలకు మాధవి గురువారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశ వర్కర్లు పద్దెనిమిదేళ్లుగా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్నారని చెప్పారు. గ్రామీణ స్థాయి పేదలకు ప్రాథమిక ఆరోగ్య సూచనలు, సలహాలు ఇస్తూ, మాత, శిశు మరణాల రేటు తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని వివరించారు. ఈక్రమంలో వారికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, పని భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తంగా

గీత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలి

కాజీపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న గీత కార్మికుల పింఛన్ దరఖాస్తులను వెంటనే పరిశీలించి తగు న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొని సాంబయ్య గౌడ్ డిమాండ్ చేశారు. కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సంఘం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంగా పింఛన్ల కోసం సంబంధిత కార్యాలయాల చుట్టూ గీత కార్మికులు తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బుర్ర శ్రీనివాస్ గౌడ్, బుంగని రాజేంద్ర ప్రసాద్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండవ రోజు గణపతి నిమజ్జనం



మడికొండ: నవరాత్రోత్సవాల సందర్భంగా రెండో రోజు గురువారం గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని నగరవ్యాప్తంగా నిర్వహించారు. విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మేళతాళాలతో వాహనాల్లో వినాయక విగ్రహాలను వైభవంగా ఊరేగించారు. ఆ తర్వాత చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. కాగా, మడికొండలో ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు, పోలీసు సిబ్బందిని ఏర్పాట్లు చేశారు. నిమజ్జనంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, జవాన్ మల్లయ్య, అయిలయ్య, కోటి సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు ‘గృహలక్ష్మి’ ఓ వరం

హసన్‌పర్తి: నిరుపేదలకు గృహలక్ష్మి పథకం ఓ వరం లాంటిదని సర్పంచ్ సాంబరెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లిలో గృహలక్ష్మి పథకాన్ని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి రజనీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలం ఉండి అర్హత కలిగిన వారికి గృహలక్ష్మి పథకం వర్తింపజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మంజుల, బీఆర్ఎస్ నాయకులు కుమారస్వామి పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కాశిబుగ్గ: గుండె సంబంధిత వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి గుండె వైద్యురాలు మాధవి సూచించారు. ఆస్పత్రిలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఉచిత గుండె వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని తెలిపారు. గురువారం 86 మందికి ఉచితంగా గుండె వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. శిబిరంలో గుండె వైద్యులు ఆర్.శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్ దుస్సా, టెక్నీషియన్లు అక్షిత, శిరీష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేయూలో కాంట్రాక్టు లెక్చరర్ల ధర్నా



కేయూ క్యాంపస్: రాష్ట్రంలో 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలోని పలు విభాగాలల్లోని కాంట్రాక్టు అధ్యాపకులు పరిపాలన భవనం ఎదుట రోడ్డు వద్ద గురువారం నిరసన తెలిపారు. అనంతరం కేయూ మొదటి గేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, నాయకులు అనిల్‌కుమార్, మధుకర్‌రావు, చందులాల్, తూర్పాటి వెంకటేష్, కవిత, దయాకర్, మంజుల, జేత్య, విజయ్‌కుమార్, కల్పన, లక్ష్మి, సౌజన్య, భాగ్య, రుమానా, సలోన, చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి, నీలిమ, శ్రీదేవి, రేఖశ్రీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటును నిలిపివేయాలి


హసన్‌పర్తి: ఒకటవ డివిజన్ నారాయణనగర్ కాలనీలో సెల్ టవర్ ఏర్పాటును నిలిపివేయాలని స్థానికులు కోరారు. ఈమేరకు నగర కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు గురువారం వినతిపత్రం అందజేశారు. కాలనీలోని చంద్రశేఖర్ అనే వ్యక్తి అక్రమ నిర్మాణ చేపడుతూ దానిపై సెల్ టవర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నాడని తెలిపారు. టవర్ ఏర్పాటు వల్ల స్థానికులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని కాలనీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ పేర్కొన్నారు.

23వ రోజుకు చేరిన విద్యార్థి జేఏసీ దీక్షలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని ప్రశ్నిస్తూ ఆందోళన చేసిన విద్యార్థి నాయకులపై కేసులు పెట్టి టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కొట్టించిన వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేయూలో చేపట్టిన నిరాహార దీక్షలు గురువారం 23వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్, సామాజిక వేత్త కూరపాటి వెంకటనారాయణ సంఘీభావం తెలిపారు. శిబిరంలో ఆరెగంటి నాగరాజు, మట్టెడ కుమార్, నిమ్మల రాజేష్, బొట్ల మనోహర్, అంకిళ్ల శంకర్, ఎండీ.పాషా, కేతపాక ప్రసాద్, నాగరాజు, రమేష్, విజయ్, సాయి, అమర్, శంకర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఔటర్‌రింగ్ రోడ్డుపై ప్రమాదం



మడికొండ: మడికొండ – రాంపూర్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న లారీని మరో లారీ గురువారం తెల్లవారుజామున ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఆగి ఉన్న లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఇసుక లోడుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ మడికొండ శివారులో ఆగిఉంది. దాన్ని గమనించని మరో లారీ డ్రైవర్.. హైదరాబాద్ వైపు వెళ్తతూ వెనుకనుంచి ఢీ కొట్టాడు. స్థానికులు స్పందించి 108కు సమాచారం అందించగా ప్రథమ చికిత్స అనంతరం ఎంజీఎం ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. కాగా, ఈ సంఘటనపై మడికొండ పోలీసు స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

శ్వేతార్కలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



గణపతి దీక్షలను విరమిస్తున్న స్వాములు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో 16 రోజుల పాటు సాగిన గణపతి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. గణపతి దీక్షలను స్వీకరించి మండల (41) రోజుల పాటు వివిధ కార్యక్రమాల్లో నిమగ్నమైన స్వాములు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 108 కిలోల బియ్యంతో వండిన అన్నంతో శ్వేతార్కుడికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణశర్మ, గురుస్వాముల నేతృత్వంలో ఇరుముడి ధారణ కార్యక్రమాలు సాగాయి. సహస్రానామార్చనలు ముగిసిన అనంతరం గణపతి హోమం, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగిసినట్లుగా దేవాలయ అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ ప్రకటించారు.

అరూరి రమేష్‌కు ఓటమి తప్పదు



మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

హసన్‌పర్తి: వచ్చే ఎన్నికల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు ఓటమి తప్పదని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాటు ఎమ్మెల్యేగా పనిచేసిన రమేష్ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిని విస్మరించడంతోనే పలు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే రమేష్‌ను అడ్డగించి నిరసన తెలిపారని గుర్తుచేశారు. సమావేశంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, మాజీ వార్డు సభ్యుడు తాళ్లపల్లి రమేష్, నాయకులు సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.